# ముసలి ప్రేమ

**ఓ** చెట్టు కింద అరుగుమీద కూర్చున్నది ఏ ఇరవైయేళ్లో ఉంటై. బంగుమూతి పెట్టింది. తుమ్మల్లో పొద్దుగూకినట్టుంది మొహం.

పళ్లికిలిస్తూ నిశ్శబ్దంగా గెంతుతూ కోతిమాదిరిగా వచ్చాడో ముసలాడు. వెనక నించి వచ్చిచ కళ్లు మూసి ఆ పిల్లని, "ఎవరో చెప్పుకో" అని అడిగాడు. మనిషి ధోరణి చూస్తే చెప్పరానంతా వెకిలిగా ఉంది. కొంచెం నిదానించి చూస్తే మనిషి నిజంగా ముసలాడు కాదు; నలభై లోపే ఉండాలి. ఆశ్చర్యం వేసింది.

"ఛీ, ఫా! ఎక్కడో!" అన్నది వయ్యారి.

ముసలాడు – ఎందుకో వాణ్ని ముసలాడనే అనబద్దువుతున్నది – పిల్ల వైఖరికి చిరాకు పళ్లేదు. పక్కన కూచుని చెవులో ఏదో అన్నాడు. అని "హి, హి, హీ!" అని సకిలించాడు. కనిపిస్తూనే ఉంది శృంగారమని.

పిల్లదాని మొహం జేవురించకపోగా నల్లబడింది. మళ్లీ, "ఛీ! ఎప్పుడు అవే కూతలు!" అన్నది.

ముసలాడు నిస్పృహ చెందలేదు. వాడి మొహాన తాండవించే నవ్వు రాను రాను వికసిస్తున్నది గాని నిరుత్సాహం చెందటం లేదు. మళ్లీ చెవిలో ఏదో అని గట్టిగా నవ్వాడు.

పిల్లది ఈసారి మాటలు వ్యర్థం చెయ్యక కాండ్రించి పక్కనే ఊసింది.

ముసలాడు విరగబడి నవ్వుతూ పిల్లదాని పమిటకొంగు పట్టుకు లాగాడు. పిల్లది వాణ్ని కాస్తా అరుగుమీదినించి ఒక్కతోపు తోసింది.

ఇప్పటికీ ముసలాడి వుద్రేకం దిగు మొహంలో లేదు. వాడి కళ్లలో కాంక్ష ఎక్కువే అవుతున్నది.

ఏమైనా సరే అని నేను కల్పించుకున్నాను. నాకు చూస్తున్నకొద్దీ ఈ ప్రణయం గురించి కొన్ని ధర్మ సందేహాలు కలిగినై.

"తాతా!" అన్నాను.

ముసలాడికి పానకంలో పుడక తగిలినట్టయి రోషంగా, "నీ కెన్నేళ్లు?" అన్నాడు. ముప్పై అయిదన్నాను.

"నాకూ అంతే! నన్ను తాతా అని పిలవకు! మొగుడూ పెళ్లాలున్నచోట నీకేం పని?" అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసి, "మొగుడూ పెళ్లాలా?" అన్నాను.

"అవును. నా రెండో పెళ్లాం! అభ్యంతరమా?" అన్నాడు.

"నాకేమీ అభ్యంతరం లేదుగాని, నీ పెళ్లాన్ని నువ్వు ప్రేమించే పద్ధతి చూస్తే తాతయ్యల్లే ఉన్నావు" అన్నాను.

"నా పెళ్లాన్ని నా యిష్టం వచ్చినట్టు ప్రేమిస్తాను. నువ్వయితే పట్టుకుని తినేస్తావు గామాలు? యవ్వనుడివి!"

"నీ ఆత్మగౌరవం ఏమయింది? కోతల్లే ప్రవర్తిస్తున్నావు. అట్లా ప్రవర్తిస్తే నీ భార్యకి నీ మీద ఏం గౌరవం ఉంటుంది?"

"గౌరవం ఏమిటి నీ మొహం! నా భార్యని నేను సుఖపెట్టగలను. అనుమానం వుంటే అడుగు. అందరిదీ నీలాటి రెండో పెళ్లే అనుకున్నావేమో!"

"ఈ పిల్ల శరీరాన్ని నువు సుఖపెట్టలేదని నేననటంలేదు. కాని మానసికంగా ఏమీ సుఖపెడుతున్నట్టు లేదు – ఆ పిల్ల చేసే వికార చేష్టలు చూస్తే!"

"రెండో పెళ్లి చేసుకున్నవాడి పెళ్లాన్ని ప్రతి వెధవా వెనకేసుకొచ్చేవాడే!... వాడేమిటో కూస్తున్నాడు చెప్పవేమో" అన్నాడు ముసలాడు.

ఆ పిల్లది తన తుమ్మల్లో పొద్దాకిన మొహం నాకేసితిప్పి, "ఎవరు, నాయనా నువూ? నా మనస్సంటున్నావేంటీ? నా మనస్సు మా ఆయనమీద తప్ప ఇంకెవరి మీదా పోలేదు. నేనెటువంటిదాన్ననుకున్నావో ఏమిటో మరి!" అన్నది.

"ఎటువంటి దానివో తెలుస్తూనే ఉంది! నీకు మానసికంగా సుఖపట్టమంటే ఏమిటో కూడా తెలీదన్నమాటే! పోనీ, ఇంతకాలానికాదర్శ దాంపత్యం చూశాను. కనకే కామాలు, మిగిలిన వాళ్లల్లే కాకుండా భార్యాభర్తలొకచోటే ఉన్నారు... కాని ఇది మాత్రం స్వర్గమల్లేలేదు! చిరకాలం ఇక్కడే ఉండండి... పోయివస్తా!"

***ముద్రణ : ఆనందవాణి, 24 డిసెంబర్ 1944***